సాక్షి సిద్దిపేట

శనివారం । 2 । మార్చి । 2024



మల్లన్నా.. నీళ్లొచ్చేనా!

మలన్నసాగర్ నుంచి చెరువులు, కుంటలు, పంట పొలాలకు నీరందించేందుకు నిర్మిస్తున్న కాల్వల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. వివరాలు 8లో ▸



గంజాయి పట్టివేత

కారులో అక్రమంగా 220 కిలోల గంజాయిని తరలిస్తుండగా పటాన్‌చెరులో అధికారులు పట్టుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. వివరాలు 8లో ▸



మున్సిపల్ ఆదాయానికి గండి

ఎన్ని అంతస్తులు కట్టినా ఒక్కదానికే మున్సిపల్ అధికారులు పన్ను వసూలు చేస్తున్నారు. దీంతో హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ రోజాశర్మ సూచించారు. శుక్రవారం స్థానిక పత్తి మార్కెట్ యార్డులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల జిల్లాలో గోదారి జలాలు పుష్కలంగా ఉన్నాయని, దీంతో రైతులు వరి తరువాత పొద్దు తిరుగుడు ఎక్కువగా సాగు చేసినట్లు పేర్కొన్నారు. మద్దతు ధర కోసం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు కీలకమైన పాత్ర పోషించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర రూ.6,760 ఉందని తెలిపారు. కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డీఎం క్రాంతి, ఎంపీపీ శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో కానరాని గుడ్డు



గుడ్డు లేకుండా భోజనం చేస్తున్న విద్యార్థులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సర్కారు బడుల్లో విద్యార్థులకు వారంలో మూడు సార్లు గుడ్డు అందించాలి. కానీ వంట కార్మికులు రెండుసార్లు మాత్రమే అందిస్తున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో గుడ్డు అందించాల్సి ఉండగా సోమ, బుధవారం అందిస్తూ శుక్రవారం ఇవ్వడం లేదు. మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గుడ్డు లేకుండానే భోజనం వడ్డించారు. ఈ విషయమై వంట కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ధర కన్నా మార్కెట్‌లో ధర ఎక్కువ ఉండడం వల్ల మూడు సార్లు అందించడం లేదన్నారు. అలాగే నాలుగు నెలలుగా వంట బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి వంట చేసే పరిస్థితి ఉందన్నారు. ఇదే పరిస్థితి చాలా పాఠశాలల్లో నెలకొంది.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి



మహిళలకు పౌష్టికాహారం అందిస్తున్న సావిత్రి

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళలు ప్రభుత్వం అందించే రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సాధికరత దిశగా అడుగులు వేసి అనుకున్నది సాధించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జెండర్ సమానత్వం, పిల్లల హక్కులు, గర్భస్థ శిశు నిర్ధారణ నిరోధక చట్టం, చైల్డ్ మ్యారేజ్ చట్టం, బాల్య వివాహాలతో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు సమతుల ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ రమాదేవి, జెండర్ స్పెషలిస్టు పద్మ, లావణ్య, మహిళలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

మెదక్ కలెక్టరేట్: తమకు రావాల్సిన 4 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, లేదంటే ఏడుపాయల్లో పారిశుధ్య పనులు నిలిపివేస్తామని గ్రామ పంచాయతీ కార్మికులు స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న కార్మికులను ఆదుకోవాలని కోరారు.

జీరో బిల్లు వచ్చేసింది



విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లును పంపిణీ చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

- జిల్లాలో ప్రారంభమైన గృహజ్యోతి పథకం
- వినియోగదారులకు పంపిణీ చేసిన అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గృహజ్యోతి పథకం జిల్లాలో ప్రారంభమైంది. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులను విద్యుత్‌శాఖ అధికారులు పంపిణీ చేశారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులు ఎలాంటి బిల్లులు చెల్లించనవసరం ఉండదు. ఈ బిల్లులను విద్యుత్ డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది. ప్రజాపాలన పేరుతో అర్హత కల్గిన వినియోగదారుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. సిద్దిపేట జిల్లాలో 2,67,734 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు ఈ నెల జీరో బిల్లును విద్యుత్‌శాఖ అధికారులు పంపిణీ చేస్తున్నారు. విద్యుత్ యూనిట్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఈ బిల్లులో గృహజ్యోతి సబ్సిడీ అని చూపిస్తోంది. నెట్ బిల్లు అమౌంట్ జీరో వస్తోంది. దీంతో వినియోగదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అర్హులందరికీ గృహజ్యోతి

అర్హులందరికీ గృహజ్యోతి అమలు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకంలో భాగంగానే వినియోగదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నాం. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన అర్హులకు ఈ పథకం వర్తిస్తుంది. అప్పుడు దరఖాస్తు చేసుకోని వారు ఎంపీడీఓ కార్యాలయంలో అప్లై చేసుకోవచ్చు. జీరో బిల్లులు వచ్చిన వారు డబ్బులు చెల్లించనవసరం లేదు.

– మహేష్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, సిద్దిపేట.

డేంజర్.. హోర్డింగ్స్

దడపుట్టిస్తున్న ప్రకటనల బోర్డులు

- విద్యుత్ వైర్లకు దగ్గరగా ఏర్పాటు
- సిద్దిపేటలో ఇష్టారాజ్యం
- కానరాని మున్సిపల్ అనుమతులు
- ఇటీవల హైడ్రోజన్ బెలూన్ పేలి యువకుడు మృతి

జిల్లాలో హోర్డింగ్‌లు దడపుట్టిస్తున్నాయి. అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. పలుచోట్ల విద్యుత్ వైర్లకు సమీపంలోనే ఉంటున్నాయి. అంతేకాక భారీగా వీస్తున్న ఈదురుగాలులకు కూలిపోతున్నాయి. దీంతో ప్రాణనష్టం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



సిద్దిపేటలోని హైదరాబాద్ రోడ్డులో ఫ్లెక్సీ చినిగిపోయి విద్యుత్ వైర్లకు తాకుతుండటంతో ప్రమాదకరంగా మారిన హోర్డింగ్

సాక్షి, సిద్దిపేట: జిల్లా కేంద్రం మెదక్ రోడ్‌లో ఓ వెంచర్‌కు సంబంధించిన ప్రకటన పేరుతో ఎల్ఈడీ లైట్లతో భారీ హైడ్రోజన్ బెలూన్ ఏర్పాటు చేశారు. ఈ నెల 24న వీచిన ఈదురు గాలులకు పక్కనే ఉన్న 220కేవీ హైటెన్షన్ తీగలపై పడి పేలిపోయింది. అదే వెంచర్‌లో పని చేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు లిల్హారే(25) అనే యువకుడు నిద్రిస్తుండగా విద్యుత్ వైర్లు మీదపడ్డాయి. దీంతో యువకుడు విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతిలేకుండానే ఇష్టారాజ్యంగా హైడ్రోజన్ బెలూన్‌ను ఏర్పాటు చేసి ఓ యువకుడు మృతికి కారణమైంది. అలాగే ముస్తాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన టీ పోల్ పైకి ఓ వ్యక్తి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటా అని ప్రయత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఆ వ్యక్తిను కిందికి దించారు. టీ పోల్‌లకు పైకి ఎక్కకుండా లాక్‌లు వేయకుండానే వదిలేశారు.

ప్రమాదకరంగా మారినా..

ప్రకటన బోర్డులు, హైడ్రోజన్ బెలూన్‌లు ప్రమాదకరంగా మారాయి. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల పట్టణాల్లో పలు ప్రధాన కేంద్రాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. కొన్నింటికి మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకోగా మరి కొన్నింటికి అనుమతి లేకుండానే ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి వేసవి, వర్షాకాలంలో ఈదురు గాలులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. హోర్డింగ్‌లు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేస్తున్నారా? లేదా అని అధికారులు పరిశీలించడం లేదు. ప్రమాదాలు జరిగినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఇష్టారాజ్యంగా ఆయా మున్సిపాలిటీల్లో ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు వెలుస్తున్నాయి.

నిబంధనలు గాలికి..

ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేసే సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలి. కానీ ఎక్కడా కానరావడంలేదు. విద్యుత్ వైర్లకు సమీపంలోనే భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. ఈదురు గాలులకు ఫ్లెక్సీలు చినిగిపోయి పక్కనే ఉన్న విద్యుత్ వైర్ల మీద పడుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ప్రతి సంవత్సరం స్ట్రక్చర్ స్టెబిలిటీ సర్టిఫికెట్ సమర్పిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సివిల్ ఇంజనీర్ పర్యవేక్షణలోనే భవనాలపై ఏర్పాటు చేయాలి. టౌన్ ప్లానింగ్ అధికారులు హోర్డింగ్‌లను పరిశీలించిన దాఖలాలు మచ్చుకు కనిపించడం లేదు. సీడీఎంఏకు మాత్రం ప్రతి ఏడాది హోర్డింగ్‌లు అన్నీ భద్రమే అంటూ నివేదికలు సమర్పిస్తూ చేతులు దులుపుకుంటున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనుమతులు లేకుండానే..

- పట్టణాలు, ప్రధాన రహదారులపై ఉండే గ్రామాల్లో అనుమతులు లేకుండానే హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.
- సిద్దిపేట పట్టణంలో లాలిపప్స్ –380, టీ పోల్స్ 27, హోర్డింగ్‌లు 55, ట్రాఫిక్ అంబరిల్లాలు 16 ఉన్నాయని అధికార లెక్కలు చెబుతున్నాయి.
- అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడంతో నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయడం లేదు.
- దీంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.
- ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేశాం

బెలూన్ ఏర్పాటు చేసిన వారికి నోటీసులు జారీ చేశాం. హైడ్రోజన్ బెలూన్‌లు ఏర్పాటు చేసినా మున్సిపల్ అనుమతులు తప్పనిసరి. పట్టణంలో ఉన్న హోర్డింగ్‌లు ఎన్ని ఉన్నాయి? ఎన్నింటికి అనుమతులు ఉన్నాయనే విషయంపై పరిశీలిస్తాం.

– ప్రసన్నరాణి, కమిషనర్, పురపాలక సంఘం సిద్దిపేట

‘గౌరవెల్లి’ని పూర్తి చేయండి



మంత్రులకు వినతి పత్రం ఇస్తున్న మంత్రి పొన్నం

మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలకు పొన్నం వినతి

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అలాగే రాజీవ్ రహదారిలో కొత్తపల్లి నుంచి హుస్నాబాద్‌కు రోడ్డు వైండింగ్ పూర్తి చేయాలని మంత్రి కోమటి రెడ్డికి మంత్రి విన్నవించారు. తన విజ్ఞప్తి మేరకు మంత్రులు ఇద్దరు సానుకూలంగా స్పందించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

మార్గదర్శకాలు తప్పనిసరి



పట్టణంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

- పరీక్షా కేంద్రాల్లో అమలు చేయాలి
- మౌలిక సదుపాయాలు మరవొద్దు
- కలెక్టర్ మనుచౌదరి
- సిద్దిపేటలో ఇంటర్ పరీక్షా కేంద్రం ఆకస్మిక తనిఖీ

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ బోర్డు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో కల్పించిన మౌలిక వసతులపై ఆరా తీశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అన్ని పరీక్షా కేంద్రాలను దర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనరల్ ఒకేషనల్‌కు సంబంధించిన ఓఎంఆర్ షీట్ల విషయంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు, గైర్హాజరు వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని ఇన్విజిలేటర్‌కు సూచించారు. సీసీ కెమెరాలు, మానిటర్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవరోధాలు లేకుండా ఉండేందుకు బందోబస్తు పటిష్టంగా నిర్వహించాలని పోలీసులకు సూచించారు. పరీక్షకు సంబంధించిన వివరాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ కలెక్టర్‌కు వివరించారు. ఇంటర్ పరీక్ష మూడో రోజు 8,077 మంది జనరల్ విద్యార్థులకు 7,757 మంది హాజరయ్యారు. 320 మంది గైర్హాజరయ్యారు. ఇక ఒకేషనల్‌కు సంబంధించి 2,798 మంది విద్యార్థులకు 2458 మంది హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ మొత్తం 10,875మంది విద్యార్థులకు గాను 10215 మందితో 94శాతం హాజరు నమోదు అయింది. డీఈసీ సభ్యులు దేవస్వామి, భూపాల్‌రాజు గజ్వేల్‌లోని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు అమరేందర్ రెడ్డి మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట, నర్సింహాచారి చేర్యాల, ముస్త్యాల, మద్దూరు, హెచ్‌పీసీ కమిటీ సభ్యులు మంగరాజు, విజయేందర్‌రెడ్డిలు దుబ్బాక పట్టణంలోని పరీక్షా కేంద్రాలను ఆకస్మింగా తనిఖీ చేశారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం: డీఐఈఓ



చిన్నకోడూరులో విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న డీఐఈఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక ఇంటర్ పరీక్షా కేంద్రంలో ఇంగ్లిష్ పరీక్ష రోజు ఆంగ్ల లెక్చరర్ పరీక్షా కేంద్రంలో ఉండటం బోర్డు నిబంధనలకు విరుద్ధమని డీఐఈఓ సూర్యప్రకాశ్ తెలిపారు. లెక్చరర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. శుక్రవారం డీఐఈఓ ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అసౌకర్యాలు కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇదిలా ఉంటే.. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న లెక్చరర్ కవితపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

మేడిగడ్డ సందర్శన సిగ్గుచేటు

బీఆర్ఎస్ నేతలవి జిమ్మిక్కులే..

- ముందు రైతులకు క్షమాపణలు చెప్పాలి
- అవినీతి వల్లే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో నాణ్యతాలోపాలు
- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



గజ్వేల్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతులేని అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నేతలు తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాల్సిందిపోయి, మేడిగడ్డ సందర్శన చేపట్టడం సిగ్గుచేటని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్లకు కక్కుర్తి పడటం వల్లే ప్రాజెక్ట్‌ల నిర్మాణం నాసిరకంగా సాగిందని ఆరోపించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునే ఉద్దేశంలో భాగంగానే ప్రజల దృష్టిని మరల్చడానికే ఈ పర్యటన చేపట్టారని ఆరోపించారు. నేషనల్ సేఫ్టీ అథారిటీ ఇప్పటికే కాళేశ్వరం నాణ్యత లోపించిందనే విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందనే విషయం స్పష్టంగా బయటపడుతోందని చెప్పారు. ఇప్పటికైనా ప్రజలకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సాగుతున్న ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమం కొత్త పుంతలు తొక్కుతోందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వారి మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని అభిప్రాయపడ్డారు. వారి విధానాలను ఎక్కడికక్కడా ప్రజల్లో ఎండగడతామని పేర్కొన్నారు.

జిల్లాను మరింత ఆదర్శంగా నిలుపుదాం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

సిద్దిపేటరూరల్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను మరింత ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి టీఎన్‌జీఓలకు సూచించారు. శుక్రవారం తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల యూనియన్ నాయకులు నూతన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ ఐకమత్యంతో పనిచేసి ఆదర్శంగా నిలిపారని, ఇదే స్ఫూర్తితో మరింతగా జిల్లాను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వినయ, సుకుమారి, సుజాత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం

రేగోడ్(మెదక్): ఆడపిల్లలను రక్షించుకుందామని మెదక్ జిల్లా హబ్ ఫర్ ఎం పవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ టీం జెండర్ స్పెషలిస్ట్ కవిత అన్నారు. గజ్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ‘బేటీ బచావో బేటీ పడావో’ కార్యక్రమం నిర్వహించారు.

చేతి వృత్తులకు చేయూత



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధికారులు

- ప్రోత్సహించేందుకే ‘పీఎం విశ్వకర్మ యోజన’
- ఎంఎస్ఎంఈ అదనపు డైరెక్టర్ దశరథం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చేతి వృత్తులను ప్రోత్సహించాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా అధికారులు అన్నారు. విశ్వకర్మ యోజన పథకం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్ఎంఈ అదనపు డైరెక్టర్ దశరథం, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్, జీఎం ఇండస్ట్రీస్ అధికారి గణేశ్‌రాం, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజన, జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవకిదేవి, ఎల్‌డీఎం సత్యజిత్, మెప్మా పీడీ హన్మంత్‌రెడ్డి, డిస్ట్రిక్ మేనేజర్ ఫర్ కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ శ్రీనివాస్‌లు మాట్లాడారు. వృత్తిని నమ్ముకుని జీవించే వారందరూ ఈ పథకానికి అర్హులన్నారు. అర్హులు ఈ స్కీం ద్వారా వచ్చే బెనిఫిట్స్ పొందాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీలు కూడా గ్రామపంచాయతీలో నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఆసక్తిగల వారందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పథకంలో భాగంగా మొదటి విడతలో లక్ష రూపాయలు, రెండో విడతలో రూ.రెండు లక్షలు చెల్లిస్తారని, ట్రైనింగ్ పిరియడ్ లో రోజుకు రూ.500 చెల్లిస్తారన్నారు. ఈ పథకాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మల్లన్నా.. నీళ్లొచ్చేనా!

మళ్లీ ఆగిన మల్లన్నసాగర్ పంట కాల్వల నిర్మాణం

మలన్నసాగర్ ప్రాజెక్టు నుంచి పంట కాల్వల నిర్మాణం పనులు మళ్లీ మొదటికొచ్చాయి. సాగర్ నుంచి చెరువులు, కుంటలు, పంట పొలాలకు నీరందించేందుకు నిర్మిస్తున్న కాల్వల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు అనుసంధానంలో భాగంగా 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ పూర్తయ్యి మూడేళ్లు అయినా ఇంకా పూర్తి స్థాయిలో పంటలకు నీరందడం లేదు. ప్రధాన కాల్వ పూర్తి అయినా పంట కాల్వల నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా చోట్ల భూ సేకరణ సమస్య, అటవీ భూముల్లో కాల్వలకు అనుమతి రాకపోవడంతో నాలుగేళ్లుగా నిర్మాణాలు కొనసాగుతూ వస్తున్నాయి. – దుబ్బాకటౌన్

- నాలుగు రోజులుగా నిలిచిపోయిన పనులు
- యాసంగికి నీళ్లొస్తాయనుకుంటే నిరాశే..
- ఎండుముఖం పడుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు

మల్లన్న సాగర్ పంట కాల్వల నిర్మాణాలు వారం రోజులుగా నిలిచిపోయాయి. దుబ్బాక పట్టణంలోని ముస్తాబాద్ వెళ్లే మార్గంలో ఉన్న కాలువ నిర్మాణం కేవలం 200 మీటర్లు పెండింగ్‌లో ఉంది. ఈ కాల్వ పూర్తి అయితే దుబ్బాక పెద్ద చెరువు, ధర్మాజీపేట చెరువులు, మల్లాయపల్లి, చెల్లాపూర్, చీకోడ్, ఆరపల్లి, అచ్చుమాయపల్లి, పోతారం, గంభీర్ పూర్, శిలాజీనగర్, వెంకటగిరి తండాతోపాటు చాలా గ్రామాల చెరువులు నింపొచ్చు. తద్వారా సుమారుగా 5 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిచవచ్చు. ఈ కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని రైతులు ఒత్తిడి తేవడంతో 20 రోజులపాటు పనులు జరిగాయి. కానీ మళ్లీ వారం రోజులుగా పనులు నిలిచిపోయాయి. ఎందుకు నిలిపివేశారని రైతులు వెళ్లి అడిగితే పైనుంచి పనులు ఆపాలని ఆదేశాలు వచ్చాయని అధికారులు చెప్పుకొచ్చారు. దాదాపు 8 పంట కాల్వల పరిస్థితి ఇలానే ఉందని రైతులు చెబుతున్నారు. యాసంగి పంటలకు నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన కాల్వ మాత్రమే పూర్తి..

■ ప్రధాన కాల్వల గుండా 20 రోజుల కిందటే నీరు వదలడంతో దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలతోపాటుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలంలోని మొత్తం 57 ప్రధాన చెరువులు నింపుతున్నారు. కూడవెల్లి, హల్దీ వాగులకు సైతం నీరు వదలడంతో జలకళ సంతరించుకున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ఎమ్మెల్యే

■ పెండింగ్‌లో ఉన్న మల్లన్నసాగర్ కాలువల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని నెల రోజుల కిందట కలిసి విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల్లో సైతం మల్లన్నసాగర్ కాల్వలు పూర్తి చేసి పంటలు కాపాడాలంటూ ఎమ్మెల్యే కోరారు. వెంటనే 20 రోజులుగా కాల్వల నిర్మాణాలు కొద్ది కొద్దిగా జరిగాయి. కానీ వారం రోజులుగా పనులు నిలిచిపోయాయి.


మల్లాయిపల్లి వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన మల్లన్న సాగర్ కాల్వ నిర్మాణం పనులు

రైతుల ఆందోళన

■ యాసంగిలో కాల్వల ద్వారా నీరందుతుందనే ఆశతో పంటలు వేసుకున్నామని తీరా కాల్వలు పూర్తి కాక పంటలకు నీరందకపోవడంతో ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్వాల పూర్తి అయితే వేల ఎకరాలకు నీరందే అవకాశం ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వలు త్వరగా పూర్తి చేసి నీళ్లొదిలి పంటలు కాపాడాలంటూ రైతులు వేడుకుంటున్నారు.

పనులు మళ్లీ ఆగిపోయాయి



వారం రోజులుగా కాల్వ నిర్మాణ పనులు ఆగిపోవడంతో రైతులమంతా అక్కడికి వెళ్లి అడిగితే పైనుంచి బంద్ చేయాలని ఆదేశాలు వచ్చాయని చెబుతున్నారు. కాల్వ నిర్మాణం పూర్తి అయి పంటలకు నీళ్లొస్తాయనే ఆశతో యాసంగిలో పంటలు వేసుకున్నామని తీరా పనులు బంద్ కావడంతో తమ పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి కాల్వ నిర్మాణ పనులు ప్రారంభించి తొందరగా పూర్తి చేసి పంటలు కాపాడాలి.
– పాతూరి అంజిరెడ్డి, రైతు దుబ్బాక

పూర్తి చేయించేందుకు కృషి చేస్తా



పెండింగ్‌లో ఉన్న మల్లన్న సాగర్ కాల్వల నిర్మాణం పూర్తి చేసి రైతుల పంటలు కాపాడాలనే ఆలోచనతోనే గెలిచినప్పటి నుంచి కృషి చేస్తున్నా. పంట కాల్వల నిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవించడం జరిగింది. అసెంబ్లీ సమావేశాల్లో సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. పెండింగ్ కాల్వలు పూర్తి చేసేందుకు శాయాశక్తుల కృషి చేస్తా. రైతులు ఆందోళన చెందొద్దు.
– ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

క్లుప్తంగా

తండ్రిని చంపిన తనయుడు

- తాగొద్దని మందలించినందుకు ఘాతుకం


చంద్రయ్య(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): కన్న కొడుకే తండ్రిని హత్య చేసిన ఘటన మనోహరాబాద్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కూచారం గ్రామానికి చెందిన బోంతపల్లి చంద్రయ్య (48), నర్సమ్మ దంపతులకు ఒక్కడే కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. ప్రశాంత్ నిత్యం తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. తండ్రి చంద్రయ్య కుమారుడిని రోజూ తాగొద్దని మందలిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం సైతం తండ్రి కొడుకులకు ఇంట్లో ఫ్యాన్ విషయంలో గొడవ జరిగింది. దీంతో కోపానికి గురైన ప్రశాంత్ గొడ్డలి కామతో తండ్రి తలపై కొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో చంద్రయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీకి తీసుకెళ్లాని వైద్యులు సూచించారు. కానీ వారు కూచారంలో ఇంటికి వెళ్లారు. రాత్రి 11 గంటలకు ఇంట్లోనే చంద్రయ్య మృతి చెందాడు. మృతుడి భార్య నర్సమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

చింతకాయలు తెంపుతూ..

- చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి


మల్లేశం(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చెట్టుపై నుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన బండారు మల్లేశం(40) గ్రామంలో చింత చెట్టు పైకి ఎక్కి చింతకాయలు తెంపుతున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. వెంటనే నార్సింగిలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడికి భార్య నాగరాణి, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్‌ఐ అమ్మద్ మోహినొద్దీన్ తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య


దుర్గేశ్(ఫైల్)

నర్సాపూర్ రూరల్: వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి అటవీ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన దుర్గేశ్ అలియాస్ దుర్గయ్య (29) గురువారం ఉదయం సెల్ ఫోన్ రిపేర్ కోసం వేరే గ్రామానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా దుర్గయ్య ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం చిప్పల్ తుర్తి అటవీ ప్రాంతంలో స్థానికులకు శవమై కనిపించాడు. వెంటనే వారు గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐతోపాటు సిబ్బంది వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఆధారాలతో గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా దుర్గయ్యను ఇక్కడికి తీసుకొచ్చి హత్య చేశారా.. లేదా వేరే ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


మాట్లాడుతున్న సీపీ అనురాధ

సైబర్ వారియర్స్ కీలకపాత్ర వహించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల నియంత్రణలో సైబర్ వారియర్స్ కీలకపాత్ర వహించాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సైబర్ వారియర్స్ సిబ్బందికి సైబర్ నివారణపై శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణ, ఫ్రీజ్ అయిన డబ్బులు బాధితులకు అప్పగించడంలో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినందుకు సైబర్ వారియర్స్‌ను సీపీ అభినందించారు. ప్రజలు, యువత సైబర్ నేరాల బారిన పడకుండా పోలీసు స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫ్రీజ్ అయిన డబ్బులు సంబంధిత బాధితులకు అందేలా బ్యాంకు అధికారులతో కీలకంగా వ్యవహరించాలన్నారు. డబ్బులు అందిన వారిని గుర్తించి మెగా లోక్ అదాలత్‌లో కేసులు డిస్పోజల్ చేయించాలని సూచించారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులను వారం రోజుల్లో డిస్పోజల్ చేయాలన్నారు. సైబర్ వారియర్స్ వారి విధులపై పూర్తిగా అవగాహనతో ఉండి విధి నిర్వహణలో ముందుకెళ్లాలని అన్నారు. సైబర్ నేరానికి సంబంధించి దరఖాస్తు రాగానే వెంటనే స్పందించి కేసు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై వచ్చే ఫిర్యాదులపై ఎన్‌సీఆర్‌పీ, సైకాప్స్ పోర్టల్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ వారియర్స్‌కు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైబర్ సెల్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ శేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, శ్రీధర్, నరేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఏరువాకా సాగారో అంటూ.. సన్నివేశంలో విద్యార్థులు

అబ్బురం.. సదేశాత్మకం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం తున్కిఖాల్సా ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. దేశానికి వెన్నెముక, ఆహార కొరత తీర్చే అన్నదాతగా క్షేత్రస్థాయిలో తమ కుటుంబాలతో కలిసి ఏరువాకా సాగారోరన్న రైతన్న అంటూ.. చెమటోడ్చే రైతుల గాధ, రామాయణం, ప్రభుత్వ పాఠశాలల గొప్పతనం, తదితర ప్రతిబింబించే విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ సునీత విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమోహన్ రావు, పీ.నాగరాజు, పులి రాజు, మంజుల, విమల శిరీష, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇనుప పిల్లర్లు మీద పడి వ్యక్తి మృతి


రంజాన్ షేక్

పటాన్‌చెరుటౌన్: ఇనుప పిల్లర్లు మీద పడి వ్యక్తి మృతి చెందని ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్ నాదియా జిల్లాకు చెందిన రంజాన్ షేక్(19) బతుకుదెరువు కోసం 15 రోజుల కిందట పటాన్‌చెరుకు వచ్చా డు. పాశమైలారంలో కేఎల్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ వద్ద రోజువారి కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం లారీలో వచ్చిన ఇనుప రాడ్ల లోడ్‌ను గ్రీన్ సహకారంతో కిందకు దింపే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు రంజాన్ షేక్‌పై పడ్డాయి. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండ నుంచి స్వగ్రామానికి మృతదేహం


కరుణాకర్ రెడ్డి (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధి కోసం ఉగాండ వెళ్లిన యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోగా మృతదేహం గురువారం నార్సింగి మండల కేంద్రానికి చేరుకుంది. నార్సింగి మండల కేంద్రానికి చెందిన తమ్మారెడ్డి లక్ష్మారెడ్డి కుమారుడు కరుణాకర్ రెడ్డి (40) ఉపాధి కోసం ఏడాది కిందట ఉగాండ దేశం వెళ్లాడు. అక్కడ సుడన్ ఎక్స్పోర్ట్ కంపెనీలో పని చేస్తూ ఫిబ్రవరి 26న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరుణాకర్ మిత్రులు సమాచారం అందించగా, కుటుంబ సభ్యులు తెలంగాణ వలస కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీ.సాయిందర్ ని సంప్రదించారు. ఆయన ఉగాండ నుంచి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించగా నార్సింగిలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు భాను ప్రసాద్ రెడ్డి (10), కూతురు భాను ప్రియా(12) ఉన్నారు.

ఎమ్మెల్యే రోడ్డు ప్రమాద కేసులో..

టిప్పర్‌ను గుర్తించిన పోలీసులు


పోలీసుల అదుపులో టిప్పర్ లారీ

పటాన్‌చెరుటౌన్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదానికి సంబంధించిన కేసులో పోలీసులు టిప్పర్‌ను గుర్తించారు. గత నెల 23వ తేదీన ఎమ్మెల్యే కారు నడపుతున్న డ్రైవర్ ఆకాశ్ నిద్రమత్తులో ముందుకు వెళ్తున్న టిప్పర్‌ను బలంగా వెనుక నుంచి ఢీకొట్టి అనంతరం ఓఆర్‌ఆర్ రైయిలింగ్ ఢీకొట్టడంతో లాస్య నందిత మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, తెల్లవారుజాము సమయం కావడంతో వీరు ఢీకొన్న టిప్పర్‌ను పోలీసులు గుర్తించలేకపోయారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రమాదం జరిగిన సమయంలో ఏఏ వాహనాలు వెళ్లాయో గుర్తించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిని నడిపిన డ్రైవర్లను విచారించారు. చివరకు టీఎస్ 08 యూజే 0025 అనే నంబరు గల టిప్పర్ ను ఎమ్మెల్యే వాహనం ఢీకొన్నట్లుగా గుర్తించారు. ఈ టిప్పర్ వెనుక భాగంలో ఉన్న సిగ్నల్ లైటు బోర్డు పగిలిపోగా, పై భాగంలో ఉన్న గార్డు లాంటి ఇనుప భాగం పక్కకు వంగిపోయింది. దీన్ని గుర్తించిన పోలీసులు విచారణలో భాగంగా డ్రైవర్ ను గుర్తించి అతన్ని పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. దీనిపై ప్రస్తుతం వివరాలు వెల్లడించలేమని త్వరలోనే జిల్లా ఎస్పీ వెల్లడిస్తారని డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు.

తప్పుడు ప్రచారాలు సహించం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గోపికృష్ణ


కార్యకర్తలతో మాట్లాడుతున్న గోపికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపికృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గోపికృష్ణ మాట్లాడుతూ.. పార్టీ ప్రవేశపెట్టిన పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తే యూత్ కాంగ్రెస్ నేతలు తరిమికొట్టాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే దిశగా కార్యకర్తలు పని చేయాలన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ చేయని పని కేవలం 2 నెలలో కాంగ్రెస్ చేసి చూపించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేస్తారన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు చేసిన అక్రమాలను త్వరలోనే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బయటపెట్టి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు అన్ని కమిటీలు వేస్తున్నామన్నారు. అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్, పట్టణ అధ్యక్షుడు గాయస్, వైస్ ప్రెసిడెంట్ బబ్బు, ప్రధాన కార్యదర్శులు శివ, సాయి ప్రతాప్, శ్రీకాంత్, అనిల్, కరుణాకర్, అజ్జు యాదవ్, జ్ఞానేశ్, నగేశ్, దాసు, అజ్మత్, వంశీ, పవన్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ముగ్గురు ఆత్మహత్య


సురేశ్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అమ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. నార్సింగి ఎస్సీ కాలనీకి చెందిన చీగుల్లపల్లి సురేశ్(32) కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పుల బాధతోపాటు కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య మౌనిక, పదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

తొగుట(దుబ్బాక): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. తొగుట ఎస్‌ఐ లింగం కథనం ప్రకారం..తొగుట గ్రామానికి చెందిన చింత కుమార్ (39) కొన్నేళ్ల కిందట అప్పులు చేసి వరికోత మిషన్, డీసీఎం కొనుగోలు చేశాడు. అవి సరిగా నడవకపోవడంతో అప్పులు తీర్చేందుకు అమ్మేశాడు. అప్పులు వడ్డీ కలిపి రూ.30 లక్షల వరకు అయ్యాయి. ఇంటి స్థలాన్ని విక్రయించి అప్పులు చెల్లించినా తీరకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో గ్రామంలో వెతికినా జాడ లభించలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని పోతరాజు చెరువు కట్టపై పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం పొలాలకు వెళ్లే రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లింగం వివరించారు.

మద్యానికి బానిసై..

మద్యానికి బానిసైన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెంగర్ల కుమార్ (44) ఏడాది కిందట రూ.3 లక్షలు అప్పు చేసి కూతురు వివాహం చేశాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికొచ్చాడు. తాగి ఎందుకు వచ్చావంటూ భార్య మందలించడంతో అదే రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఉదయం జంగాపల్లి రోడ్డు వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

---

220 కిలోల గంజాయి పట్టివేత

- సుమారు రూ.55 లక్షల విలువ
- ఒకరు రిమాండ్, పరారీలో ఇద్దరు


వివరాలు వెల్లడిస్తున్న హరికిషన్

పటాన్ చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన పటాన్‌చెరులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. శుక్రవారం మెదక్ డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి టోల్ ప్లాజా సమీపంలో గురువారం అర్ధరాత్రి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆంధ్రలోని ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు చెందిన చంద్రకాంత్ కారే సొంత రాష్ట్రానికి 220 కిలోల గంజాయిని కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. మరో ఇద్దరు విశాల్ దిలీప్, అమర్ సంజయ్ పరారుకాగా, చంద్రకాంత్‌ను రిమాండ్‌కు తరలించారు. గంజాయి విలువ సుమారు రూ.55 లక్షలు ఉంటుందని హరికిషన్ పేర్కొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళంకు చెందిన రాజు పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేసే సమయంలో పటాన్‌చెరుకు చెందిన ఫిరోజ్‌తో పరిచయం ఏర్పడింది. రాజు పని మానేసి శ్రీకాకుళం వెళ్లిపోగా, ఫిరోజ్‌కి డబ్బులు అవసరం కావడంతో రాజుకు ఫోన్ చేశాడు. తన వద్ద లేవని, గంజాయి వ్యాపారం చేస్తున్నానని కావాలంటే గంజాయి పంపిస్తా అమ్ముకోమని చెప్పాడు. అందుకు ఫిరోజ్ ఒప్పుకొని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ రింగ్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి గంజాయిని విక్రయిస్తుండగా కొల్లూర్ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను ఢీకొట్టిన లారీ
- ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

తొగుట(దుబ్బాక): బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకొని వచ్చిన వలస కార్మికుల జీవితాలను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. తొగుట ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్ కుమార్ (22), విద్యాసాగర్ (22), సచిన్ కుమార్ (19) కొంతకాలంగా మల్లన్న సాగర్ నిర్మాణ సంస్థ అయిన కేఎన్‌ఆర్‌లో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారు. ఉదయం డ్యూటీ ముగించుకొని తొగుటకు బైక్ పై వస్తున్నారు. ఈ క్రమంలో గజ్వేల్ నుంచి సిద్దిపేట వైపునకు ఓ లారీ వస్తోంది. తొగుట శివారులోని మలుపు వద్ద లారీ వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్ కుమార్, విద్యాసాగర్ అక్కడికక్కడే మృతి చెందారు. సచిన్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సచిన్ కుమార్‌ను హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు విద్యాసాగర్ తమ్ముడు పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ లింగం వివరించారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణానికి చెందిన వెల్దండి శ్రీనివాస్(52) శుక్రవారం రాత్రి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా మల్లెచెట్టు చౌరస్తాలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. కాలుపై లారీ వెళ్లడంతో కాలు నుజ్జు నుజ్జు అయ్యింది.


తొగుట(దుబ్బాక): ప్రమాదానికి కారణమైన లారీ, పక్కన అజయ్ కుమార్, విద్యాసాగర్ మృతదేహాలు

బొలేరో వాహనం బోల్తా..

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలం అక్కన్నపేట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. కామారెడ్డి పట్టణానికి చెందిన షేక్ పీర్‌బాషా (54) బొలేరో వాహనంలో సంగారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో బోల్తా పడింది. తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు.
